క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు అన్నదానం ఏర్పాటుచేశారు.

రబీ పంటల సాగుపై అవగాహన

మైదుకూరు : మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు శనివారం రబీ పంటల సాగుపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ రబీ పంటలైన మినుము, శనగ, వేరుశనగ పంట సాగులో యాజమాన్య పద్ధతులు, జీవన ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పసుపు, అరటి, మిరపలో ఎరువుల యాజమాన్యం గురించి తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి పంటల సాగులో అంతర పంటల గురించి, ఫిరోజ్ హుస్సేన్ పసుపు, అరటిలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ గురించి వివరించారు.

మైదుకూరు చరిత్రపై అవగాహన కల్పించాలి

మైదుకూరు : మైదుకూరు చరిత్ర గురించి గోడలపై చిత్ర పటాలు వేయించి అవగాహన కల్పించాలని ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, రచయిత బొమ్మిశెట్టి రమేష్, అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు తవ్వా వెంకటయ్య శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా చేయడంతో భవిష్యత్తు తరాలకు స్థానిక చరిత్రను తెలియజేయడమేగాక, దానిపై కొంత అవగాహన కల్పించే అవకాశం ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు.

కల్లూరులో గ్రామ సభ

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని కల్లూరు సచివాలయంలో శనివారం సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు–గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీ సర్వే జరిగిందని, అపరిష్కృత సమస్యలు ఉంటే రైతులు అధికారులకు విన్నవించి పరిపరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ, బాదుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులు

పోరుమామిళ్ల : మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ చిన్నకప్పలపల్లెలో శనివారం ప్రగతి ఫౌండేషన్, శ్రీరామ సాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పోరుమామిళ్లకు చెందిన బ్రయాన్స్ ఆసుపత్రి వైద్యులు మౌనికారెడ్డి, చిత్తా అమితారెడ్డి 300 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కప్పలపల్లె ప్రజలకు సూచించారు. ఆసుపత్రి వ్యవస్థాపకులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ గిరిప్రణీత్‌రెడ్డి, కో చైర్మన్ ప్రజ్వలరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ వార్డుల్లో పర్యటన


సాయి కుటీర్ రోడ్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శనివారం పర్యటించారు. 2వ వార్డులోని బొకరాపేట, వైఎస్ నగర్, వైఎంఆర్ కాలనీ ప్రాంతాల్లో ఆయన పర్యటించి మురికి కాల్వలను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందితో కాల్వల్లో పూడిక తీయించారు. సాయికుటీర్ రోడ్డు, వైఎంఆర్ కాలనీలో వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

చాపాడులో ధాన్యపు నిల్వగోదాము

చాపాడు : మండల కేంద్రమైన చాపాడు సమీపంలోని విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ధాన్యపు నిల్వ గోదామును ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదివారం ప్రారంభించనున్నట్లు గోదాము నిర్వాహకులు విజయవర్ధన్ రెడ్డి తెలిపారు. మండల రైతులకు ఉపయుక్తంగా ఉండేలా గోదాము ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వెళ్తున్నారు.. వచ్చేవారు లేరు

బద్వేల్ మునిసిపాలిటీని సిబ్బంది కొరత వేధిస్తోంది. వచ్చిన వారంతా బదిలీపై వెళ్తున్నారేగానీ.. వారి స్థానంలో కొత్త నియామకాలు జరగడం లేదు. దీంతో పురపాలక పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది.

- మున్సిపాలిటీని వేధిస్తున్న సిబ్బంది కొరత
- 65 మందికి గానూ.. పనిచేస్తున్నది 32 మందే
- వివిధ పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం



బద్వేలు మున్సిపల్ కార్యాలయం

బద్వేల్ అర్బన్ : బద్వేల్ మునిసిపాలిటీలోని 35 వార్డులలో లక్ష మంది నివాసం ఉంటున్నారు. వీరికి పురపాలకలో వివిధ రకాల సేవలదించేందుకు కమిషనర్‌తో పాటు వివిధ విభాగాలలో 65 మంది సిబ్బంది అవసరం. కానీ కమిషనర్‌తోపాటు 32 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వివిధ విభాగాలలో 33 మంది అవసరం కాగా, కేటాయింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో పాలన కుంటుపడి ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది.

పారిశుద్ధ్యం అధ్వానం

పారిశుద్ధ్య విభాగంలో పట్టణ జనాభాకు అనుగుణంగా 200 మంది సిబ్బంది కావాలి. అయితే రెగ్యులర్‌గా 9 మంది, ఔట్ సోర్సింగ్ విధానంలో 73, దినసరి వేతనం కింద 22 మంది చొప్పున ఉన్నారు. దీంతో నిత్యం చెత్త సేకరణ, కాల్వల శుభ్రత లేక పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోంది. మున్సిపాలిటీ ఏర్పడి 18 ఏళ్లు కావస్తున్నా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం జరగలేదు.

పలు పోస్టులు ఖాళీ

మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో 65 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా, 32 మంది మాత్రమే ఉన్నారు. కమిషనర్ తర్వాత కీలకమైన మున్సిపల్ మేనేజర్, పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు ఉండాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు ఏఈల స్థానంలో ఒకరే పని చేస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్లు ఆరుగురికి గానూ ఐదుగురు, జూనియర్ అసిస్టెంట్లు పదిమందికి గానూ ఏడుగురు పనిచేస్తున్నారు. ఇక మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చడంలో కీలక పాత్ర పోషించే బిల్ కలెక్టర్లు ఏడుగురు అవసరం కాగా, ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. మరో కీలక టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీబీవో స్థాయి అధికారులు నలుగురు, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లు ఉండాల్సి ఉండగా.. ఒక్కరూ లేరు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఒక్కగానొక్క టౌన్ సర్వేయర్ పోస్టు భర్తీ కాలేదు. పర్మినెంటు స్వీపర్లు 12 మందికిగానూ 9 మంది ఉన్నారు. ఇక సీనియర్ స్టెనోగ్రాఫర్, సిస్టం మేనేజర్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్, జూనియర్ అకౌంటెంట్ పోస్టులను ఇప్పటికీ భర్తీ చేయలేదు. సిబ్బంది కొరత ఉండటంతో మున్సిపాలిటీ ప్రజలకు సకాలంలో సేవలందడం లేదు. ఉన్న సిబ్బందిపై ఒత్తిడి పెరగడంతో బదిలీపై బద్వేల్‌కు వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమిస్తే మెరుగైన సౌకర్యాలు కల్పించిన వారవుతారని ప్రజలు కోరుతున్నారు.

పనుల నిర్వహణలో జాప్యం


బద్వేల్ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి పూర్తిస్థాయి సిబ్బంది నియామకం జరగలేదు. వివిధ రకాల పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా స్పందించడంలేదు. కీలక విభాగాల్లోనైనా సిబ్బందిని నియమిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– వీరశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

పని భారం పెరుగుతోంది


మున్సిపాలిటీలో జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందిపై పని భారం పెరిగింది. ఉన్నతాధికారులు చొరవ చూపి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి. పెరిగిన జనాభాతో చెత్త పెరగడంతో సేకరించేందుకు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– నాగేంద్రబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా


మున్సిపాలిటీలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే అవసరమైన మేర సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి సిబ్బందిని రప్పించేలా కృషి చేస్తాం.

– వి.వి.నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

నేడు 'తుమ్మెద పదాలు' పుస్తకావిష్కరణ సభ

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం ఉదయం కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన 'తుమ్మెద పదాలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించనున్నట్లు చైతన్య సాహిత్య కళా వేదిక కార్యదర్శి కాశీవరపు రాజేంద్రకుమార్ శనివారం తెలిపారు. సాహితీ వేత్తలు, సాహిత్య అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రంగయ్యగారి వీధిలోని అవోపా మిట్టా వెంకట కృష్ణయ్య భవన్‌లో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు అపర్ణ శ్రీరాం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కీళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, శ్వాసకోస వ్యాధులు, ఇతర వాటిని పరీక్షించి మందులు ఉచితంగా ఇస్తారన్నారు.

మెప్మా బజార్‌కు స్పందన

మైదుకూరు : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌కు రెండో రోజున శనివారం స్పందన లభించింది. స్టాళ్లలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వస్తువులు, కుట్లు, అల్లికలను విక్రయానికి పెట్టారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఈ కెజియ, సీఓలు పుల్లయ్య, రమణమ్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

మహిళా మార్టు ఆదాయం సభ్యులకు పంచాలి

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న మురళీమోహన్‌రెడ్డి

ఖాజీపేట : మహిళా మార్టు నుంచి వచ్చిన ఆదాయాన్ని అర్హులైన మహిళా సంఘాల సభ్యులకు పంచాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఖాజీపేటలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 820 గ్రూపుల సభ్యుల ద్వారా రూ.24 లక్షలు సేకరించి మహిళా మార్టు ఖాజీపేటలో ఏర్పాటుచేశారని తెలిపారు. 2022 నవంబరులో ప్రారంభించిన ఈ మార్టు ద్వారా రూ.11 లక్షల వరకు లాభాలు వచ్చాయని, ఆ మొత్తాన్ని సభ్యులందరికీ పంచాలని విజ్ఞప్తి చేశారు. వేంపల్లి, పోరుమామిళ్ల, సీకెదిన్నె మండలాల్లోని మహిళా మార్టులకు ప్రభుత్వం నుంచి రూ.20 లక్షల గ్రాంటు విడుదలైందని, ఖాజీపేట మార్టుకు నిధులు కేటాయించాలని కోరారు. చక్కటి ఆలోచనతో మహిళా మార్టులు ఏర్పాటుచేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రహారం సొసైటీ మాజీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ కమిటీ సభ్యుడు శివారెడ్డి, డి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టపాసుల దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో టపాసు దుకాణాల యజమానులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ లైసెన్సు పొందినవారు మాత్రమే టపాసుల విక్రయాలు సాగించాలన్నారు. అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కువ మొత్తంలో టపాసులు ఉంచితే సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి దుకాణదారుడు తమ దుకాణం వద్ద నీటి డ్రమ్ము ఏర్పాటుచేయడంతోపాటు ఇసుక ఉంచాలన్నారు. స్టాల్స్‌కు నాణ్యత కలిగిన ఎలక్ట్రికల్ తీగలు ఉపయోగించాలని, విద్యుత్తు శాఖ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. వ్యాపారులు ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు విక్రయించాలని కోరారు. సమావేశంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ భరణిక్రిష్ణ, సేల్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు గాయత్రి, వేణుగోపాల్‌రెడ్డి, తహశీల్దార్లు, సీఐలు, ఫైర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు


చిన్నాయపల్లెలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కాశినాయన : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నాయపల్లెలో రైతులు సాగు చేసిన పత్తిపంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు చీడ పీడలు సోకిన వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

షర్మిల చరిత్ర హీనులవుతారు

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పద్మశాలీ విభాగం అధ్యక్షురాలు జింకా విజయలక్ష్మి



ప్రొద్దుటూరు : అన్నకే వెన్నుపోటు పొడిచిన షర్మిల చరిత్ర హీనులవుతారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పద్మశాలీ విభాగం అధ్యక్షురాలు, అడ్వకేట్ జింకా విజయలక్ష్మి వ్యాఖ్యానించారు. ప్రొద్దుటూరులో శనివారం ఆమె మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోక మునుపే తన వారసులకు ఆస్తులు పంపిణీ చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాను సొంతంగా సంపాదించిన ఆస్తులను తన చెల్లి షర్మిలకు పంచారన్నారు. అమ్మ, చెల్లి మీద కోర్టులో జగన్ కేసు వేశారని చెప్పి అన్న మీద చెల్లితో సహా పచ్చ బ్యాచ్ కుటిల రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఆస్తులు ఈడీ జప్తులో ఉన్నాయి కాబట్టి జగన్ మోహన్‌రెడ్డి ఎంఓయూ ఇచ్చారన్నారు. ఎంఓయూతో ఆమె సర్దుకోలేక ఉన్నారనే కారణంతో జగనన్న విజయమ్మ పేరున గిఫ్ట్ చేశారన్నారు. అన్నీతెలిసి షర్మిల స్టేటస్‌కో ఇచ్చిన ఆస్తులు బదలాయించి జగన్ బెయిల్ రద్దుకు పన్నాగం పన్నారని ఆరోపించారు. రాజశేఖర్‌రెడ్డి రక్తం అని పదే పదే చెప్పే షర్మిల వైఎస్సార్ విరోధి అయిన చంద్రబాబుతో కలిసి నీచ రాజకీయాలు చేయడం వైఎస్సార్ ఆశయాలను కొనసాగించినట్లు అనిపిస్తుందా అని ప్రశ్నించారు. చంద్రబాబు తోబుట్టువులు ఎలా ఉన్నారు, ఆయన వెన్నుపోటు పొడిచిన ఎన్టీఆర్ కుటుంబం ఎక్కడ ఉందో షర్మిల గమనించుకోవాలన్నారు.

ప్రయాణికుల భద్రత.. డ్రైవర్ల బాధ్యత


ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్ : ప్రయాణికులను భద్రంగా తీసుకెళ్లే బాధ్యత ఆటో డ్రైవర్లదేనని ట్రాఫిక్ సీఐ జావీద్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడ రాదని అన్నారు. ఆటోలలో ఎక్కువమందిని తీసుకెళ్లవద్దని సూచించారు. పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణికులతో ప్రయాణం చెయ్యడం నేరమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఆర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు కృత్రిమ అవయవాల కోసం కొలతల శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని వెంకటేశ్వర్లపేట సరస్వతీ విద్యా మందిరంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల కోసం కొలతల శిబిరాన్ని ఆదివారంనిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ కళావతి, సభ్యులు శ్రీధర్, సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆల్ ఇండియా జైన్ యూత్ ఫెడరేషన్ మహవీర్ లింబ్ సెంటర్ సహకారంతో జైపూర్ కృత్రిమ చేయి, కాలు అమరిక శిబిరాన్ని ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు. పేర్లు నమోదు చేసుకున్న దివ్యాంగులు ఈ శిబిరానికి హాజరవ్వాలని, వారికి డిసెంబర్ 15న కృత్రిమ అవయవాలు అమరుస్తారని తెలిపారు.

ఆర్మీ ర్యాలీకి ఇబ్బంది లేకుండా చూడాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మున్సిపల్ మైదానం, డీటీడీసీలో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మున్సిపల్ మైదానం, నాగరాజుపేట, రవీంద్రనగర్, సెంట్రల్ జైలు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ర్యాలీ సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ర్యాలీకి హాజరయ్యే వారికి మరుగుదొడ్లు, శుభ్రత విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాగరాజుపేట రవి థియేటర్ వెనుక భాగంలో ప్రజల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలనలు చేసి, ఆ ప్రాంతంలో డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. పెద్ద కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శానిటేషన్ అధికారులకు ఆదేశించారు. సెంట్రల్ జైలు వద్ద పైపులైన్ లీకేజీ ఉన్న ప్రాంతంలో తక్షణమే మరమ్మతులు చేయించి, తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రవీంద్ర నగర్ 6వ డివిజన్ సచివాలయాన్ని తనిఖీ చేస్తూ, చిన్నారికి టీకా ఇంజెక్షన్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని, వాటికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై వార్డు హెల్త్ సెక్రటరీపై ప్రత్యేక ఆఫీసర్ ద్వారా విచారణ చేయించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె. రాకేష్‌చంద్ర, ధనలక్ష్మి, చంద్రశేఖర్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

గణిత శాస్త్రంలో ప్రావీణ్యం సాధించడమే లక్ష్యం


విద్యార్థులతో శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం నాగిరెడ్డి, ప్రిన్సిపల్ తమాలి

ప్రొద్దుటూరు : గణిత శాస్త్రంలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించడమే లక్ష్యంగా శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం కృషి చేస్తోందని ఏజీఎం నాగిరెడ్డి, ప్రిన్సిపల్ తమాలి తెలిపారు. స్థానిక కొత్తపల్లె రింగ్ రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గణిత శాస్త్రం అంటే ఒక రకమైన భయం విద్యార్థులకు ఉందని, మెదడుకు పదును పెట్టకుండా భూతద్దంలో చూస్తూ ఇతర ఎలక్ట్రికల్ సాధనాలపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. పిల్లల్లో గణిత శాస్త్రం మీద పట్టు తెచ్చేలా శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. తమ పాఠశాలలో చదివే 15 మంది విద్యార్థులు 300 సూత్రాలు అవలీలగా చెబుతారని అన్నారు.

క్షేత్ర పర్యటనతో విద్యార్థులకు విజ్ఞానం


యోగి వేమన యూనివర్శిటీ సందర్శించిన పోరుమామిళ్ల విద్యార్థులు

పోరుమామిళ్ల : క్షేత్ర పర్యటనలతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని వృక్ష శాస్త్ర అధ్యాపకులు శ్రీధర్‌మూర్తి అన్నారు. పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం కడప యోగి వేమన యూనివర్సిటీని సందర్శించారు. పుట్ట గొడుగుల పెంపకం, జీవవైవిధ్యం, వృక్ష జాతుల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. వర్మీ కంపోస్టు, విక్టోరియా అమెజానిక్ లిల్లీ పాండ్, లోటస్ పాండ్ సైకడోరియం, నైట్ హౌస్ సెడ్ హైస్ మొక్కలను సందర్శించారు. శ్రీధర్ మూర్తి మాట్లాడుతూ క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల ఆలోచనా స్థాయి పెరుగుతుందని, వారు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరిబాబు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు


వ్యవసాయ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజ

అట్లూరు : రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచినట్లు బద్వేల్ ఏడీఏ ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేల్ వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో శనివారం బద్వేల్, అట్లూరు, సిద్దవటం, గోపవరం మండలాల ఏవోలు, రైతు సేవా కేంద్రాల సహాయకులతో ఆయన సమీక్షించారు. ఏడీఏ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది, గ్రామ విత్తన పథకం, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం క్లస్టర్ డెమో, రబీలో పంటల బీమా, ఈ పంట నమోదు విశ్లేషణ, బీడు భూములను సాగులోకి తీసుకురావడానికి ప్రణాళిక అమలు, పంటకోత ప్రయోగాల నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక మార్కెట్ యార్డులో నాణ్యత పరీక్ష కేంద్రం సేవలను వివరిస్తూ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకునేలా చూడాలన్నారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అర్హులైన వారికి అన్ని పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

సెన్సార్ గుర్తిస్తేనే డ్రైవింగ్ లైసెన్స్


ప్రొద్దుటూరులోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్


ట్రాక్ ఏర్పాటు కోసం సిద్ధంగా ఉన్న పరికరాలు

ప్రొద్దుటూరులో ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఇప్పటి వరకు డ్రైవింగ్ లైసెన్స్‌ల విషయంలో కొన్ని అవకతవకలు జరిగేవి. సిఫార్సులకు తలొగ్గి కొందరు అధికారులు సక్రమంగా డ్రైవింగ్ చేయకున్నా లైసెన్స్ జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉండేవి. ఆటోమేటిక్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటుతో వీటికి చెక్ పెట్టవచ్చని భావిస్తున్నారు. ట్రాక్ పనులు ప్రారంభించేందుకు వారు సమాయత్తమవుతున్నారు.


- ప్రొద్దుటూరులో సైంటిఫిక్ ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్
- నవంబర్ ఆఖరుకు అందుబాటులోకి తెచ్చేలా సన్నాహాలు
- డ్రైవింగ్‌ను సెన్సార్లు గుర్తిస్తేనే అందరికీ లైసెన్స్‌కు అర్హత

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో గుజరాత్ తరహా సైంటిఫిక్ ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ఏడేళ్ల కిందట అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇక్కడి ఎంవీఐల బృందం గుజరాత్ రాష్ట్రానికి వెళ్లి అక్కడి ట్రాక్‌ను పరిశీలించింది. అయితే అప్పటి ప్రభుత్వం ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఆటోమేటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినా కొంత జాప్యం జరుగుతూ వచ్చింది. ఏడాది క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసి ఈ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన పరికరాలన్నీ గతేడాది ప్రొద్దుటూరు ఆర్టీఓ కార్యాలయానికి చేరాయి. డ్రైవింగ్ ట్రాక్‌లో కెమెరాలు, సెన్సార్లు ఏర్పాటు చేసేందుకు పోల్స్ కూడా ఏర్పాటు చేశారు. అనంతరం ఉన్నపాటుగా కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశారు. ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు ట్రాక్ పనులు ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు.

పూర్తిస్థాయిలో డ్రైవింగ్ ట్రాక్ నిర్మాణం

సాధారణంగా డ్రైవింగ్ టెస్టుకు వచ్చిన వ్యక్తి వాహనాన్ని సరిగా నడుపుతున్నాడా లేదా అనేది ఎంవీఐ పరిశీలిస్తాడు. సక్రమంగా డ్రైవింగ్ చేస్తే ఎంవీఐ టెస్ట్ పాస్ చేసి డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తాడు. ఇకపై డ్రైవింగ్ టెస్ట్‌లో ఇలా పాస్, ఫెయిల్ చేయడం ఎంవీఐల చేతిలో ఉండదు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో వాహనదారుడు సక్రమంగా డ్రైవింగ్ చేసేది, లేనిది సెన్సార్‌లే పసిగడతాయి. సరిగా డ్రైవింగ్ చేయకుంటే ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ సాయంతో, సెన్సార్ సిస్టం కెమెరాలు గుర్తించి ఫెయిల్ చేస్తాయి. ఎంవీఐల ప్రమేయం ఏమాత్రం ఉండదు. జిల్లాలో ప్రొద్దుటూరులోనే తొలుత ఈ ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను ఏర్పాటుచేస్తున్నారు. నవంబర్ 29వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో ట్రాక్‌ను అందుబాటులోకి తెస్తామని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు.

సరిగా డ్రైవింగ్ చేస్తేనే లైసెన్స్


ప్రొద్దుటూరులో ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ త్వరలో అందుబాటులోకి రానుంది. లైసెన్స్ కోసం వచ్చే వ్యక్తులు వాహనాన్ని బాగా నడపడం నేర్చుకోవాలి. సరిగా నడపకపోతే సెన్సార్‌లు గుర్తించి ఫెయిల్ చేస్తాయి. ట్రాక్ ఏర్పాటయ్యాక లైసెన్సుల జారీలో ఎంవీఐల పాత్ర ఉండదు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన సెన్సార్‌లతోనే ఈ ప్రక్రియ జరుగుతుంది.

–పి మురళీధర్, ప్రొద్దుటూరు ఆర్టీఓ